"హాబీ కాదు ప్రొఫెషన్... వృత్తి. మా తాతగారు, మా నాన్నగారు చేసిన కులవృత్తి"

"అంటే మీకు వేరే ఇండస్ట్రీలు అవి..."

"ఇది ఇండస్ట్రీ కాదా? వాట్ ఈజ్ ద లిటరల్ మీనింగ్ ఆఫ్ ఇండస్ట్రీ... వ్యవసాయ రంగం కూడా ఇండస్ట్రీయే కదా!"

"మరి నాకేదో ఉద్యోగం అని... ఇంగ్లీషులో మాట్లాడి, ఇంటర్వ్యూలు చేసీ..."

"ఇంగ్లీషు మాట్లాడితే వ్యవసాయం చేయకూడదా? వ్యవసాయం చేసుకునే వాడికి ఇంగ్లీషు రాకూడదా? చూడు మిస్టర్ సుందరం... నీకిచ్చిన జాబ్ ఇదే. నువ్వు ఏ పని చెప్తే ఆ పని చేస్తానన్నావ్. నీకు నచ్చకపోతే నాకు నచ్చకపోతే వెళ్లిపోవలసింది నువ్వే. నువ్వు రెండు వేలడిగావ్. నేను రెండువేల అయిదొందలిస్తానన్నాను. ఎగిరి గంతేసొచ్చావ్. ఇప్పుడు మొహం వేలాడేస్తావేం"

"నా చేత మట్టి పని చేయిస్తారా"

"నీకా అదృష్టం ఉంటే అదీ చేయిస్తా. ఇప్పుడు నువ్వు చేయవలసిందల్లా కొబ్బరికాయలు దింపించడం, లారీల్లో ఎక్కించడం, లెక్కలు రాసుకోవడం, వసూలు చేయించడం, ఎప్పుడు ఏ ఎరువులు వేయించాలో, ఎప్పుడు ఏ మందులు కొట్టించాలో చూసుకోవడం అన్నీ ఇంగ్లీషు పనులే. ఒక్క నెల చూడు. నచ్చకపోతే వెళ్లిపో"

సుందరం 'ఇదా నా ఉద్యోగం' అని నిరాశగా ఉన్నాడు.

"నాకిద్దరు కొడుకులయ్యా, ఇద్దర్నీ ఈ పనిలో పెట్టినా నీకిచ్చే జీతం కన్నా ఎక్కువ సంపాదించుకునే వాళ్లు. కానీ వాళ్లకి పట్నం మోజు.

